

లోహిత్‌ను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: జపెవల రాజమండ్రి, గుంటూరులో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన శెట్టి లోహిత్ మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను కలిశారు. క్రీడాకారుని అభినందించి డిసెంబర్ నెలలో ఒడిస్సా భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వెళ్లేందుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని కలెక్టర్ అన్నారు. చదువుతోపాటు క్రీడారంగంలో మంచి నైపుణ్యత సాధించి దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు.



లోహిత్‌ను సన్మానిస్తున్న కలెక్టర్


కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై..

నిరసనలు



పాడేరులో నిరసన చేపడుతున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు, కార్మికులు, మహిళలు

ప్రజాశక్తి -పాడేరు: దేశవ్యాప్తంగా రైతు కార్మిక సంఘాలు సంయుక్తంగా కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్థానిక ఐటీడీఏ నుంచి రైతు కార్మిక సంఘాలు ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్లి ధర్నా చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఆదివాసి కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు జి.చినబాబు మాట్లాడుతూ, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు, రైతులు పట్ల పాత విధానాలే అవలంబిస్తూ తీవ్రమైన ద్రోహం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ, రైతులకు గిట్టుబాటు ధర వంటి అంశాలు తీవ్రంగా పట్టిపీడిస్తున్నాయన్నారు. గిరిజన ప్రాంతంలో కాఫీ రైతులు పండిస్తున్న పంటలకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వలేదని, ప్రోత్సాహక నిధులు కోట్ల రూపాయల బకాయిలు పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటిడిఏ పరిధిలో పని చేస్తున్న డైలీ వేజ్ కార్మికులకు కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, కేంద్రం ప్రకటించిన కనీస వేతన చట్టం ప్రకారం రూ.26000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ హాస్టల్స్, గురుకులాల్లో పని చేస్తున్న టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు వాలంటీర్లకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు పని వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కాఫీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.లక్కు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందర్రావు, గ్రామ వాలంటీర్ల యూనియన్ నాయకులు సురేష్, ఏఐటియుసి జిల్లా కన్వీనర్ అమర్, రాజబాబు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నపూర్ణ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు దాసమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు....



రంపచోడవరంలో వినతిపత్రం ఇస్తున్న మహిళలు

రంపచోడవరం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. రంపచోడవరం ఐటీడీఏ వద్ద ధర్నా నిర్వహించి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి నిర్మల, జిల్లా కోశాధికారి కె.రామలక్ష్మి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, స్కీమ్ వర్కర్లకు జీతాలు పెంచాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని, అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.సిరిమల్లిరెడ్డి, సిఐటియు యూనియన్ నాయకులు కొమరం చెల్లయమ్మ, కె.మంగాయమ్మ, కె.రమణమ్మ అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ లక్ష్మణరావు

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు

విశాఖ జిల్లా ఆనందపురం రాయల్ హాస్పిటల్ సౌజన్యంతో ఏపీ జెన్కో ఫోర్‌మెన్ పి.నారాయణరావు (నానాజీ) టీం ఆధ్వర్యంలో జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కళ్యాణ మండపంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏపీ జెన్కో ఈఈ రాజేంద్రప్రసాద్, సీలేరు ఎస్ఐ కే.రవీంద్ర ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఆర్థో అండ్ న్యూరో కండిషన్స్, రిహెబిటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, స్త్రీ వైద్య నిపుణులు లాస్మి డాక్టర్ పి.విజయానందరావు, సీలేరు పీహెచ్సీ వైద్య అధికారి డాక్టర్ సౌమ్య 550 మందికి వివిధ రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ మందులను ఏపీ జెన్కో ఫోర్ మెన్ పి.నారాయణరావు (నానాజి) తన ఖర్చులతో సమకూర్చారు. సీలేరు, దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు చిత్రకొండ తదితర ప్రాంతాల అధిక సంఖ్యలో ప్రజలు వైద్య శిబిరానికి తరలివచ్చారు. రాయల్ హాస్పిటల్ ల్యాబ్ నిర్వాహకులు రూ.4వేలు ఖరీదైన పూర్తిస్థాయి బ్లడ్ టెస్టలకు రూ.999కు చేశారు. మారుమూల గ్రామాల నుంచి వైద్య శిబిరంకు వచ్చిన ప్రజలకు బాలాజీ రెస్టారెంట్ ఓనర్ నక్క జ్ఞానేశ్వర్‌రావు దంపతులు ఉచిత భోజన సౌకర్యం లాడ్జి ఆవరణలో కల్పించారు. ఈ కార్యక్రమంలో సీలేరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి, ఏపీ జెన్కో ఏడిఈ దుర్గా శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ సిహెచ్ లలితాదేవి, మురళి, సిబ్బంది, సర్పంచ్ పాంగి దుర్జో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్, స్థానిక నాయకులు వానపల్లి అప్పారావు, డిఏవి పిఈటి కమలాకర్, స్థానిక పీహెచ్సీ ఆరోగ్య పర్యవేక్షకులు జోజిబాబు, హెచ్‌ఎస్ త్రినాధ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-అడ్డతీగల

బాల కార్మికుల నిర్మూలనపై అడ్డతీగల మండలం కేంద్రంలో జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పలు హెటల్స్లో, షాపులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 14 సంవత్సరాలలోపు వయసు కలిగిన బాలలను పనులలో పెట్టుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పారా లీగల్ వాలంటీర్లు తీగల బాబురావు, బేలెం సత్యనారాయణ, నేబుల శాంతకుమారి, కోనపు రాజ్యలక్ష్మి తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పారా లీగల్ వాలంటీర్లు

2 వేల మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యం

- జిసిసి చైర్మన్ శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి -అరకులోయ :ఈ ఏడాది 2వేల మెట్రిక్ టన్నుల కాఫీని కొనుగోలుకు లక్ష్యం పెట్టుకోవాలని రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. జిసిసి చైర్మన్ పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా అరకులోయలోని పర్యాటక శాఖ పున్నమి అతిథి గృహంలోని గోష్టి హాలులో చింతపల్లి, పాడేరు డివిజన్ పరిధిలోని జిసిసి డీఎం, బ్రాంచి మేనేజర్లు,సేల్స్ మేన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించి గిరిజన సహకార సంస్థ (జిసిసి) పై సమీక్షించారు. గతంలో జిసిసి అభివృద్ధికి ఎంతో కృషి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.గత ప్రభుత్వం గిరిజన సహకార సంస్థను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని, తెలుగుదేశం ప్రభుత్వ హాయంలో ఈ సంస్థను నిలబెట్టి పరుగులు తీయించాలని సూచించారు. గిరిజన సహకార సంస్థను ప్రక్షాళన చేసి రూపు రేఖలు మార్చడమే తన లక్ష్యమని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.15 వందల నుంచి 2వేల మెట్రిక్ టన్నుల వరకు కాఫీని సేకరించాలని ఆయన ఆదేశించారు. కాఫీ పంటపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులతో సమావేశాలు నిర్వహించి పర్యవేక్షిస్తానని ఆయన అన్నారు. కాఫీ తో పాటు ఇతర అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై దృష్టి సారించాలన్నారు.బెంగళూరు వంటి ప్రాంతంలో కాఫీ పంట ఉన్నప్పటికీ, ఏజెన్సీ ప్రాంతంలో అడవులపై ఆర్గానిక్ కాఫీ పండించడంతో ఇక్కడ కాఫీకి మంచి గిరాకీ ఉందన్నారు. అందుకే ప్రపంచ దేశాలు అరకు కాఫీ కొనుగోలుకు పోటీ పడుతున్నాయని ఆయన అన్నారు. జిసిసి సంస్థలోని సిబ్బంది కాఫీ కొనుగోలుకు ఫీల్డ్‌కు వెళ్లడానికి అలవెన్స్ చెల్లించే విషయంపై ఆలోచిస్తామన్నారు. మండల కేంద్రాల్లో జిసిసి గోడౌన్‌లను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో కాఫీ జనరల్ మేనేజర్ ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పాడేరు జిసిసి డిఎం డి.సింహాచలం, చింతపల్లి డిఎం దేవరాజు వివిధ మండలాల జిసిసి మేనేజర్లు, సేల్స్ మెన్లు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిసిసి చైర్మన్ శ్రావణ్‌కుమార్

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ :పాడేరులో డిసెంబర్ 4, 5వ తేదీల్లో జరిగే అల్లూరి జిల్లా సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గుంటసీమలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, మహాసభలో ముఖ్యంగా గిరిజన చట్టాలు, హక్కులు, జీవో 3 చట్టబద్ధత, నిరుద్యోగ యువతకు ఉపాధిపై చర్చ ఉంటుందన్నారు. అనేక సమస్యలపై కార్యచరణ రూపొందించి భవిష్యత్తు ఉద్యమాలకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తిలక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

విద్యా ప్రమాణాలు మెరుగుపడకుంటే చర్యలు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పడక పోతే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. ఉపాధ్యాయుల బోధనా తీరు మారాలన్నారు. స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో సహాయ గిరిజన సంక్షేమాధికారులు, మండల విద్యాధికారులు బేస్లైన్ ఎగ్జామ్ దిశ కార్యక్రమం అమలుపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థుల విద్యాసామర్థ్యాలు సక్రమంగా లేవన్నారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ఎం.ఇ.ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి అంకితభావంతో కృషి చేయాలని చెప్పారు. విద్యార్థులను ఎబి సిడిలు గా విభజించి సి డి గ్రూపులలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలన్నారు. పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యాప్రమాణాలను పరిశీలించి స్టార్ రేటింగ్ ఇస్తామన్నారు. ఈనెల 29,30 తేదీలలో మార్గదర్శిని వర్కుషాపు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, డి.ఇ. ఓ బ్రహ్మాజీ రావు, 11 మండలాల ఎటిడబ్ల్యూఓలు, నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారి నారాయణ రెడ్డి రంపచోడవరం, చింతూరు డివిజన్లకు సంబంధించిన అధికారులు పర్చువల్ గా పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు: సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పతాక దినోత్సవ స్టిక్కర్లు, కారు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ స్టిక్కర్లను జిల్లాలోని వివిధ కార్యాలయమునకు పంపి వాటి అమ్మకం ద్వారా వచ్చిన సొమ్మును యుద్ధంలో మరణించిన/ గాయపడిన వారి కుటుంబాల సంక్షేమంకు వినియోగించనున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి సత్యానందం మరియు సీనియర్ సహాయకులు శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ప్రచారం చేయండి

పాడేరు : హింసకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖలు హింసకు వ్యతిరేకంగా కలిసి కట్టుగా ఒకే స్వరం అనే నినాదంతో రూపొందించిన గోడ పత్రికను డి. ఆర్ డి.ఏ .పి.డి.వి.మురళి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ డిఎస్‌డిఓ రోహిణి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు తదితరులతో కలిసి ఆవిష్కరించారు.

అంబులెన్స్ కోసం కాల్ సెంటర్

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఏజెన్సీ ప్రాంతములోని 11 మండలాల ప్రజలకు సౌలభ్యం కోసం అదనపు జిల్లా మెడికల్ హెల్త్ అధికారి (ఐ.టి.డి.ఎ) కార్యాలయములో కాల్ సెంటర్ సదుపాయం ఏర్పాటు చేసినట్లు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్‌భాషా ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితులలో అంబులెన్స్ కొరకు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్: 18004250004కు డయల్ చేయాలన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి-పాడేరు

75 వసంతాల భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాజాంగంలో పొందు పరిచిన విధంగా అందరం ఉద్యోగాల పొందుతున్నామని పేర్కొన్నారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, డి.ఆర్.ఓ పద్మలత, డి.ఆర్.డి.ఏ .పి.డి. వి.మురళి పాల్గొన్నారు.

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు. వేంకటేశ్వరరావు, వి. ఎస్.ప్రభాకరరావు, పరిపాలనాధికారి ఎం. హేమలత అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కూనవరం మండలం కూటూరులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

చింతపల్లి: 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని చింతపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్తు సీనియర్ అసిస్టెంట్ రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ బాలకిషోర్, కూటమి నాయకులు వంతల బుజ్జిబాబు, లక్ష్మణ్, ఆనందరావు, చిందాడ అప్పారావు (చిన్న) పాల్గొన్నారు.

స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో స్థానిక ఏడిఆర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆళ్ల అప్పలస్వామి ఆధ్వర్యంలో 75 వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు బయ్యపు రెడ్డి, బాల హుస్సేన్ రెడ్డి, జోగారావు, వెంకటేష్ బాబు, సందీప్ నాయక్ పాల్గొన్నారు.

దుంబ్రిగుడ:భా మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో రత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. టిడిపి మండల నాయకుడు ఎస్ జక్కయ్య ఆధ్వర్యంలో గుంటసీమ అంబేద్కర్ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల దండలు వేసి నివాళులర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, ఏపీఓ సూరిబాబు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : భారతదేశ ప్రజలందరూ సమానమేనని భారత రాజ్యాంగం ద్వారా చాటి చెప్పిన ఘనత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కే దక్కుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఏ సమావేశపు హాల్లో 76వ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ డివిజన్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వివిధ శాఖలకు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఓ కె.చిట్టిబాబు, పిఏఓ యల్. రాంబాబు, తహశీల్దార్లు ఏఎస్‌వి రామకృష్ణ, బాలాజీ, ఎంపీడీవోలు యస్.శ్రీనివాసరావు, విశ్వనాథ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి అనూష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి. వెంకట్రావు, ఆర్‌సిహెచ్ నాగేశ్వరరావు, కె.శకుంతల, జి.హారతి, కె. శైలజ, కె. శ్రీదేవి, కె. శ్రీలక్ష్మి, జి.సాయికుమార్, ఎన్. రమేష్, బి. శ్రీనివాసరావు, పి.సుభద్ర, ఎస్.మూర్తి, వి. శీనయ్య, సంగం నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.




అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న రంపచోడవరం ఐటిడిఏ పిఓ

విఆర్.పురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ పి.రాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అసిస్టెంట్ యం చినబాబు, తెలుగు లెక్చరర్ శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని కూటూరు పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, టీడీపీ మండల నాయకులు భరపాటి ప్రకాశరావు, అంగన్వాడీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : భారత రాజ్యాంగం దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక వంటిదని జికె.వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కళాశాలలో మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అనుసరిస్తూ నడవాలని విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీలేరు జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పేరెంట్, టీచర్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని 76 పాఠశాలలో డిసెంబర్ 7 తేదీన జరుగు పేరెంట్, టీచర్ సమావేశాలను విజయవంతం చేయాలని ఎంపిడిఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర శిక్షణకు, వికాసానికి పేరెంట్స్ టీచర్స్ సమావేశం దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి పాఠశాలలో 12 కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, రిసెప్షన్ కమిటీ, భోజనం వసతి కమిటీ, స్టేజి డెకరేషన్ కమిటీ ప్రధానమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు సిహెచ్. బాలాజీ, సీడీపీఓ ప్రసన్న విశ్వనాథ్, విద్యాశాఖ అధికారి తాతబ్బాయి దొర, పరిపాలన అధికారి రత్నకుమారి, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఓ శ్రీనివాస విశ్వనాథ్

జిఒ 124ను అమలు చేయండి

సచివాలయ హెల్త్ సెక్రటరీల వినతి


డిఎంహెచ్ఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న హెల్త్ సెక్రటరీలు

ప్రజాశక్తి-పాడేరు: జీవో 124ను అమలు చేయాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలోని సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలు మంగళవారం అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్ భాష కి వినతి పత్రం అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్ శాఖల మధ్య పని ఒత్తిడితో నలిగి పోతున్నామని వారు ఆవేదన వ్యక్తపరిచారు. ఉన్నతాధికారులు జీవో 124 జారీ చేసి సచివాలయ హెల్త్ సెక్రటరీలు ఆరోగ్య శాఖ పరిధిలోనే పనిచేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్రింది స్థాయిలో ఎంపీడీవోలు వాటిని అమలు పరచకుండా వారి శాఖలోని కార్యక్రమాలు కూడా చేయాల్సిందేనని పట్టుపడుతున్నారని వాపోయారు. ఒకే రోజు రెండు శాఖల అధికారులు పనులకు పిలుస్తున్నారని వాపోయారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇచ్చిన పనులు చేయకపోతే డ్యూటీ సర్టిఫికేట్ ఇవ్వలేదని, ఎంపీడీవో చెప్పిన పని చేయకపోతే జీతాలు చెల్లించమని అంటున్నారని చాలా గందరగోళం పరిస్థితుల్లో సచివాలయం హెల్త్ సెక్రటరీలు విధులు నిర్వహిస్తూ మానసిక శోభకు గురి అవుతున్నామన్నారు. అధికారులు ఇచ్చిన ఆదేశాలను అమలు చేసే విధంగా చొరవ తీసుకోవాలని అల్లూరి జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ భాష కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షరాలు ఎం వి వి ఎస్ కుమారి, మండల అధ్యక్షులు కె.సుశీల, పుష్పవతి, రాజేశ్వరి గౌరవ అధ్యక్షులు శెట్టి నాగరాజు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ యూనియన్ నాయకులు కె లక్ష్మణరావు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తాడేపుట్టు పంచాయతీ పరిధిలో బిఎస్ఎన్ఎల్ సేవలు మెరుగు మెరుగుపరచాలని టిడిపి మండలం యూనిట్ ఇంచార్జ్ సోమేలి లక్ష్మయ్య కోరారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. బిఎస్ఎన్ఎల్ నెట్వర్కు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. పూర్తిస్థాయిలో సిగ్నల్ లేక ఆన్లైన్, బ్యాంక్ ఇతర ఇతర సేవలు మొరాయి స్తున్నాయన్నారు. కోట్నాపల్లి పంచాయతీ పరిది 17 గ్రామాలు, తాడేపుట్టు పంచాయతీలో 7గ్రామల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటి కైనా స్పందించి బిఎస్ఎన్ఎల్ సేవలు పూర్తిస్థాయిలో అందించాలని ఆయన కోరారు.

చలితో హాస్టళ్ల విద్యార్థులు గజగజ

తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలి : ఎపిసిసి ప్రధాన కార్యదర్శి వెంకటరావు

ప్రజాశక్తి- మాధవధార : రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు చలి తీవ్రత తట్టుకునేందుకు దుప్పట్లు, కార్పెట్లు, చాపలు పంపిణీ చేయకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారనిలి ఎపిసిసి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఒబిసి విభాగం ఇన్ఛార్జి మూల వెంకటరావు ఆరోపించారు. ఇప్పటికే పలు సంక్షేమ హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకుని, కనీస సౌకర్యాలు లేక కునారిల్లిపోతున్నాయన్నారు. అనేక హాస్టళ్లకు కిటికీలు, ద్వారాలకు తలుపులే లేవన్నారు. ఈ నేపథ్యంలో రెండురోజులుగా గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు, చలితీవ్రతతో అనేక హాస్టళ్లలో కటిక నేలపై పడుకునే విద్యార్థులు నిద్రలేని రాత్రులను గడుపుతున్నారన్నారు. కొన్నిచోట్ల ఒకే దుప్పటిని ఇద్దరు ముగ్గురు విద్యార్థులు కప్పుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. చలి తీవ్రతకు విద్యార్థులు అస్వస్థతకు గురై అల్లాడిపోతున్నారన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, సంబంధితశాఖ మంత్రితోపాటు అధికారులు చొరవ చూపి, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు చలి నుంచి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు నేతల వినతి



సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రాథమిక పాతశాల శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్ల కు రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్, గ్రాడ్యూటీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

ఈ సందర్భంగా సిఐటి మండల కార్యదర్శి మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథక కార్మికులు, శానిటేషన్ కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ కార్యదర్శి ఎస్ మంగలన్న, అధ్యక్షులు వంతల దొంబురుతో పాటు సిఐటియు నాయకులు, ఎస్.గాసిరామ్, కే డొంబురు, సిపిఎం లక్ష్మీపురం సర్పంచ్ కె త్రినాధ్ ఎంచ్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.630 కోట్లతో తాగునీటి పథకాలు

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా వ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ పథకంలో రూ.630 కోట్లతో తాగునీటి పథకాలను నిర్మిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ .ఎస్ .దినేష్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుండి గ్రామీణ నీటి సరఫరా విభాగం, పౌర సరఫరాలు, డి.ఆర్.డి.ఎ, విద్యాశాఖ, ఆహార భద్రత, మార్కెటింగ్, మార్క్ఫెడ్, నైపుణాభివృద్ధి సంస్థ, గిరిజన సంక్షేమం (విద్య) అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. గడప గడపకు పూర్తి స్థాయిలో తాగునీరందించిన తరువాతనే పథకం పనులు పూర్తి చేసామన్నారు. జిల్లాలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులకు నష్టం లేకుండా ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సాధారణ రకం ధాన్యానికి రూ.2300లు, ఎ గ్రేడు రకం ధాన్యానికి రూ.2320లు రైతులకు మద్దతు ధర అందించాలని చెప్పారు. రాగులకు 20 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రాగులకు రూ. 4290లు మద్దతు ధర చెల్లించాలని ఆదేశాలు జారీ చేసారు. లబ్దిదారులకు అందిస్తున్న చౌక బియ్యం పక్కదారి పట్టకుండా డి.ఆర్. డిపోలను స్పెషల్ డ్రైవ్ పెట్టి తనిఖీ చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రుణ పరపతిని పెంచాలని అధికారులకు సూచించారు.

రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం ఎపిఎంల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసారు. వారపు సంతల్లో నకిలీ సరుకు విక్రయించకుండా ఆహార భద్రతా అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. స్వయం సహాయ సంఘాలతో వారపు సంతల్లో మార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. వారపు సంతలను తహశీల్దారులు, ఎంపిడిఓలు తనిఖీ చేయాలన్నారు. ఔత్సాహిక వ్యాపార వేత్తలకు ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో యువతకు పరిశ్రమలు, వ్యాపారాలు నెలకొల్పడానికి శిక్షణ అందిస్తారని, మండలం నుండి ఐదుగురు చొప్పున గుర్తించాలని చెప్పారు. ఈ సమావేశంలో డి.ఆర్ .డి. ఏ. పి.డి. వి.మురళి, జిల్లా పౌర సరఫరాల అధికారి బి.గణేష్ కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ జవహార్ కుమార్, మండల ప్రత్యేకాధికారులు నంద్, రమేష్ కుమార్ రావు, సిపి ఓ ఎస్ ఎస్ ఆర్ కె. పట్నాయక్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రజని, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి రోహిణి, మార్కెటింగ్ ఎడి రాకేష్, డూమా పీడీ. విద్యా సాగర్ పాల్గొన్నారు.

సేంద్రియ విధానంలో ఆశాజనకంగా వరి పైర్లు

ప్రజాశక్తి-చింతపల్లి : సేంద్రీయ ఉత్పత్తి ద్వారా పోషకాలు కలిగిన వరి పంటను అభివృద్ధి పరచడం జరిగిందని పెదబరడ మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఒరిస్సా రాష్ట్రంలో ఫిల్లా టాంకిగా పిలువబడే వరి విత్తనాన్ని తీసుకువచ్చి ఇక్కడ సేంద్రీయ విధానంలో సాగు చేయడం జరిగిందన్నారు. తెలుగులో తల్లి పిల్ల గా పిలువబడే ఈ వరి విత్తనం ఎకరాకు 8 కేజీలు నారు పోసి లైన్ మార్క్ విధానంలో నాటడం జరిగిందన్నారు. రెండేసి పిలకలు చొప్పున నాటిన ఈ నారు దుబ్బుకు 20 వరకు పిలకలు వచ్చాయన్నారు. ఒక్కొక్క వెన్ను కంకి కి సుమారు 25 నుంచి 300 వరకు గింజలు వచ్చాయన్నారు. ఎకరాకు 45 నుండి 50 బస్తాల వరకు దిగుబడి రావచ్చని అంచనా ఉందన్నారు. గింజలు పెద్దగా రావడంతో పాటు పోషక విలువలు బాగా ఉన్నాయన్నారు పచ్చిరొట్ట పశువుల గెత్తం వాడడం జరిగిందన్నారు.


వరి పంటను చూపుతున్న మాజీ సర్పంచ్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి


ప్రమాదంలో ఆటో కింద ఇరుక్కుని మృతి చెందిన డ్రైవర్

ప్రజాశక్తి -అనంతగిరి: ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని గుమ్మ పంచాయతీ ఈతమనువలస సమీపంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరల ప్రకారం... సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగిందన్నారు. పెద్దబిడ్డ పంచాయతీ గ్రామానికి చెందిన సాలేపు దిలీప్ కుమార్ (27) మృతి చెందాడన్నారు. ఈతమనువలస సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో మృతి చెందినట్లు తెలిపారు. అర్ధరాత్రి కావడంతో స్థానికులు ఎవరు గమనించ లేదన్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం అరకు ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ


ప్రమాదంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి- పెదబయలు: సీతగుంట పంచాయతీ పెదబయలు ఎంపీడీఓ క్వార్టర్స్ సమీపంలో జర్సింగి రామన్న ఇంటి సమీపంలో మంగళవారం ఉదయం విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీ కోంది. దీంతో, విద్యుత్ స్తంభం నేల కొరిగింది. చుట్టుపక్కల ఇళ్లలో మంటలు చెలరేగి విద్యుత్ షార్ట్ కావడతో పది ఇళ్లల్లో విద్యుత్ మీటర్స్ కాలిపోయాయి.

ఉత్తమ ఎఎస్‌ఒగా చైతన్య

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్‌లోని నావల్ వింగ్ సీనియర్ విభాగంలో బెస్ట్ అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ (ఎఎన్ఒ)గా డాక్టర్ బుల్లయ్య కాలేజీ ఎన్‌సిసి విభాగం ఉప లెఫ్టినెంట్ టిఎన్..చైతన్య గుర్తింపు పొందారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 76వ ఎన్‌సిసి రైజింగ్ డే వేడుకల సందర్భంగా ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నుంచి గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చైతన్యను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్.కె. చక్రవర్తి, యుజి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, పిజి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌విహెచ్. శ్రీకాంత్, మేజర్ బ్రహ్మానందరెడ్డి ఇతర ఎన్‌సిసి అధికారులు అభినందించారు.


దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గం

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఉక్కు ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1384వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎల్ఎంఎం, డబ్ల్యుఆర్ఎం 1, 2, ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రగతికి కృషి చేస్తున్న కార్మికవర్గానికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని తెలిపారు. ఏడు నెలలుగా రెండు వాయిదాల పద్ధతిన జీతాలు చెల్లిస్తూ వచ్చిన ఉక్కు యాజమాన్యం రెండు నెలలుగా పూర్తిగా జీతాలే చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్లాంట్ యాజమాన్యం మొండి వైఖరి పట్ల కార్మికులు అసహనంతో ఉన్నారన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించకుంటే కార్మికాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు ఎ.మసేన్‌రావు, డి.దేముడు, జి.ఆనంద్, ఎంకెవి.రాజేశ్వరరావు, సన్నిబాబు, పి.సీతారామరాజు, రాంబాబు, బాషా, కార్మిక సంఘాల నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, ఎం.మహాలక్ష్మి నాయుడు, దాసరి సురేష్ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన జనసేన నేతలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం సున్నంపాడు పంచాయతీ పరిధి నూరుపూడి అంగన్వాడీ కేంద్రాన్ని జనసేన మండల అధ్యక్షుడు మల్ల దుర్గాప్రసాద్, యూత్ ప్రెసిడెంట్ భీశెట్టి సత్యకుమార్ మంగళవారం సందర్శించారు. అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడి ఎంతమంది పిల్లలు ఉన్నారో ఆరా తీశారు. పిల్లలకు మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అంగన్వాడీ సిబ్బందిని కోరారు.

కెజిబివి విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలం ఎర్రంపేటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న 80 మంది బాలికలకు రెండో విడతగా దస్తులను మంగళవారం ఆరోగ్య భారతి, భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్ ప్రసాద్, ఆవుల సుబ్బారావు పాల్గొన్నారు.

ఐలాజ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-అడ్డతీగల : ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర ప్రథమ మహాసభ డిసెంబర్ 8న కాకినాడ జిల్లా అన్నవరం, శ్రీశేషాద్రి సదన్‌లో జరుగుతుందని, దానిని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం అడ్డతీగల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభకు ఐలాజ్ జాతీయ ప్రధాన కార్యదర్శి క్లిఫ్టన్ డి.రోజారియో ముఖ్య అతిథిగా హాజరువుతున్నారని తెలిపారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ న్యాయవాదుల ప్రయోజనాలు, ప్రజల హక్కులను కాపాడడంలో ఐలాజ్ ముందుంటుందని తెలిపారు.

కోర్టుల్లో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు సౌకర్యాలు, ప్రయోజనాలు కల్పించాలని, రక్షణ చట్టం తీసుకురావాలని, మానవ హక్కులు, పౌర హక్కుల కోసం పోరాడే న్యాయవాదులపై ప్రభుత్వాలు నిరంకుశ నల్ల చట్టాలు ప్రయోగించడాన్ని ఆపాలని, న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడ్డతీగల బార్ న్యాయవాదులు కెఎన్‌వి రమణ, వై.శ్రీనివాస్, డి.శ్రీధర్, ఇ.గౌరీశంకర్, ఐలాజ్ కన్వీనర్ బుగత శివ, సభ్యులు జోగా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ సిటీ డిపోలో నూతన బస్ సర్వీసులను మంగళవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. లంకెలపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్ స్కూల్ ఉన్న సెక్టార్ 12, జనరల్ హాస్పిటల్‌కు బస్సు సర్వీసులను, అలాగే నూతన సూపర్ లగ్జరీ బస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిపో మేనేజర్లు గౌతమ్ చటర్జీ, కె.గంగాధర్, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి.శ్రీనివాస్, మెకానికల్ ఫోర్‌మ్యాన్ భూషణం, రామకృష్ణ పాల్గొన్నారు.

బాల్యం కేంద్రాల అభివృద్ధికి ముందుకురండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో నడుస్తున్న బాల్యం విద్యా కేంద్రాల నిర్వహణకు దాతలు ముందుకు రావాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం ఆయన మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నడపబడుతున్న బాల్యం విద్యా కేంద్రాల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి అందించిన యూనిఫాం క్లాత్‌తో స్థానిక దాతల ద్వారా సేకరించిన నిధులతో కుట్టించిన యూనిఫాం, స్కూల్ బెల్ట్, స్కూల్ షూ, సాక్సులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (విద్య అండ్ ఫైనాన్సు) ఎస్ఎస్.వర్మ, బాల్యం విద్యా కేంద్రాల సూపర్‌వైజర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్ సంపత్ కుమార్

విశాఖ-కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లో విశాఖపట్నం - కిరండూల్ - విశాఖపట్నం మధ్య నడిచే కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జోడించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 08551 విశాఖపట్నం - కిరండూల్ రైలుకు డిసెంబర్ 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27 తేదీల్లోనూ, 08552 కిరండూల్ - విశాఖపట్నం రైలుకు డిసెంబర్ 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లోనూ అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జత చేయనున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురిపై చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం జోన్ - 8 టౌన్ ప్లానింగ్‌లో విధుల్లో నిర్లక్ష్యం వహించిన వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ సుబ్బలక్ష్మిపై సస్పెన్షన్ వేటు పడింది. అదే జోన్‌లో టిపిఒ తేజేశ్వరరావు, అప్పటి ఎసిపి రఘునాథరావులకు షోకాజ్ నోటీస్‌లను జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ మంగళవారం అందజేశారు.

30న పించన్ల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో లబ్ధిదారులందరికీ ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను వారి వారి ఇంటి వద్దనే సకాలంలో పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచన మేరకు డిసెంబర్ 1వ తేదీ (ఆదివారం) సెలవు దినం కావడం వల్ల పింఛన్ల పంపిణీ కార్యక్రమం నవంబరు 30న ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని కోరారు.

ఘనంగా విహెచ్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు తొత్తరమూడి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ పోరాటం ద్వారానే సాధ్యమైందని అన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అక్కిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలేదీ ?

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలులో లేదని, గడచిన ఆరు మాసాలుగా రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎల్‌ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి వైసిపి ఆధ్వర్యంలో నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం అగ్రరాజ్యాలతో పోటీ పడాలని, అందరూ సమానంగా సమాజంలో మెలగాలని అంబేద్కర్ చెప్పారన్నారు. గడచిన ఆరు మాసాల కూటమి పాలనలో అంబేద్కర్ విగ్రహాల మీద దాడులు పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ పాల్గొన్నారు.


చర్చలు జరుపుతున్న తోషిబా, హెచ్ఎస్ఎల్ అధికారులు

తోషిబా - హెచ్ఎస్ఎల్ అధికారుల సమావేశం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్, జపాన్‌లోని తోషిబా బ్యాటరీ డివిజన్ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మధ్య మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. 'మేకిన్ ఇండియా'లో భాగంగా భాగంగా షిప్‌యార్డ్ రచించిన ప్రణాళికలను హెచ్ఎస్ఎల్ అధికారులు వివరించారు. తోషిబా రూపొందించిన అత్యాధునిక లిథియం టైటానియం ఆక్సైడ్ బ్యాటరీ టెక్నాలజీని ఏకీకృతం చేయడంపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా సాటో గోరో-సాన్ మాట్లాడుతూ, భారత్‌లో నౌకా నిర్మాణంలో స్థిరమైన ఆవిష్కరణలకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని అన్నారు. డైరెక్టర్ సిఎమ్‌డి ఇ గిర్దీప్ సింగ్ మాట్లాడుతూ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ప్రపంచ స్థాయి పరిష్కారాలను అందిస్తుందన్నారు. సమావేశంలో తోషిబా ఇండియా డైరెక్టర్ కజుటక నిషిమురా - సాన్, సేల్స్ ఇంచార్జ్ రాకేష్ ట్రాక్రు, ఎల్‌డబ్ల్యుటి గ్రూప్ ప్రతినిధి మణీందర్ సింగ్ పాల్గొన్నారు.

ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : జీవో నెంబర్ 3పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చి, మెగా డీఎస్సీలో ఏజెన్సీ ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆదివాసీ నిరుద్యోగులు పులి అశోక్ కుమార్, సోడి చందు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనాదిగా ఏజెన్సీ ప్రాంతంలో జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీలకు ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వాలు, న్యాయస్థానాలు వ్యవహరించడం దారుణమన్నారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో ఆదివాసీ ప్రజానీకాన్ని భౌతికంగా అడవికి దూరం చేస్తూ, చదువుకున్న ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే జీవో 3ను రద్దు చేయడం చూస్తుంటే ఆదివాసీల అంతం చేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అటవీ సంపదను, గనులను దోచుకోవడానికి ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి దొరకక అసాంఘిక కార్యకలాపాల వైపు, నక్సలిజం వైపు మొగ్గు చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



విశాఖ తీరంలో ఎగిసిపడుతున్న అలలు

అలజడిగానే వాతావరణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న తూర్పు హిందూ సముద్రం మధ్య కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా మారడంతో ఆ ప్రభావం వాతావరణ పరిస్థితులపై పడింది. మంగళవారమంతా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో చల్లని గాలులు వీచాయి. తీరంలో అలలు ఎగిసిపడ్డాయి. కోస్తాకు, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు వర్ష సూచన ఉండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విషయం తెలిసిందే.